క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్ తెలిపారు. జొన్నలగడ్డ 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సాతులూరు, చందవరం, దొండపాడు, పానుగుపాడు, డైరీ ఇండస్ట్రీస్, సాతులూరు ఇండస్ట్రీస్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఈ నెల 12న కారు ఢీకొని ఇరువురు ఒడిశా కార్మికులకు గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిని దాటుతున్న ఇరువురు కార్మికులను కారు ఢీకొన్న ప్రమాదంపై ఆదివారం కేసు నమోదైంది. ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు ఒడిశాకు చెందిన అంకిత్‌బోరా, ప్రమోద్ బెహ్రా గణపవరం గ్రామంలోని నూలు కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 12న రాత్రి 10 గంటల సమయంలో జాతీయ రహదారి దాటుతున్న సమయంలో వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఇరువురూ సుమారు 10 అడుగులు పైకి లేచి కారు అద్దాలపై పడ్డారు. ఇరువురికి గాయాలు కావటంతో 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనాల తనిఖీలు

వినుకొండ: పట్టణంలో శివయ్య స్థూపం సెంటరులో ఆదివారం వాహనాలు తనిఖీలు చేపట్టారు టౌన్ ఎస్ఐ సమీర్‌బాషాతో పాటు పోలీసు సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి అపరాధరుసుము విధించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రమాదాలు తగ్గించేందుకు వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



దొడ్లేరు(క్రోసూరు): జూలై 10వ తేదీన గురుపౌర్ణమిని పురస్కరించుని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని దొడ్లేరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం జరిగింది. శ్రీకృష్ణుడిని జగద్గురువుగా ఎందుకు పూజించాలో వారు వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు, సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సి.హెచ్.అనురాధ, ఎస్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై.రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

పేదల ఆకలిని తీరుస్తున్న అమ్మ చేయూత ట్రస్ట్



సత్తెనపల్లి: అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పేద ప్రజల ఆకలి తీరుస్తున్నారని రిటైర్డ్ ఏఎస్ఐ పిల్లుట్ల ఆంజనేయులు అన్నారు. అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్, తాలూకా సెంటర్‌లోని అన్నార్తులకు చింకా వీరయ్య వర్ధంతి సందర్భంగా వారి ధర్మపత్ని చింకా శివమ్మ సహకారంతో ఆదివారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ చేసే సేవా కార్యక్రమాలు ఎంతోమంది పేదలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయన్నారు. ఇప్పటికే ఈ సంస్థ ద్వారా పేద మహిళలకి నిత్యావసర సరుకులు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు చింకా అంకమ్మరావు, పిక్కిలి రత్తయ్య, చామర్తి ఆంజనేయులు, నిమ్మలపల్లి నాగమల్లేశ్వరరావు, చింకా నారాయణ, పి.శివ, పిల్లుట్ల పెద్దన్న పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

బొల్లాపల్లి: యంగ్‌స్టార్ హెల్పింగ్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లాలిపురం, రామాపురం, గ్రామాల్లో నిరుపేదలైన మైనారిటీ కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మామిడిపల్లి అనీల్ పాల్గొని మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ పెనుమాల వెంకటేశ్వర్లు, సెక్రటరీ రాహుల్ నాయక్, కమిటీ సభ్యులు మనోహర్‌బాబు, విజయ్‌బాబు, పెనుమాల అంకారావు, పెండెం వెంకటరత్నం, రత్నరాజు ధూళిపాళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొండను తవ్వేస్తున్నారు!

- దొండపాడు వద్ద అక్రమ మట్టి తవ్వకాలు
- ఇష్టానుసారంగా తవ్వకాలతో కనుమరుగవుతున్న శివాలయం కొండ
- మట్టిని ప్రభుత్వ పథకాలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు అమ్ముకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు



దొండపాడు కొండ వద్ద మట్టి అక్రమ తవ్వకాలు

వినుకొండ: అధికారంలోకి వచ్చింది దరిమిలా కూటమి నేతలు మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపులకు తెరతీశారు. అక్రమంగా సరిహద్దులు దాటిస్తూ రూ.లక్షలు వెనుకేసుకుంటున్నారు. వినుకొండ నియోజక వర్గంలోని ఐదు మండలాలల్లో ఇష్టానుసారంగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. వినుకొండ రూరల్ మండలం దొండపాడు గ్రామంలో చెరువు ఆనుకుని, మునిస్వామి కొండను ఆనుకుని పొక్లెయిన్లతో మట్టిని అక్రమంగా తవ్వుకుని, వేలాది ట్రక్కులతో తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కొండకూడా కనుమరుగయ్యే దశకు చేరుకుంది.

యంత్రాలతో మట్టి తవ్వకాలు

అక్రమ మట్టి తవ్వకాల కోసం నిత్యం పొక్లెయినర్లు, బుల్ డోజర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు వంటి వాటితో రాత్రీ పగలు తేడాలేకుండా ఇప్పటికే కోట్లాది రూపాయల విలువగల మట్టిని అక్రమంగా అమ్ముకున్నారు. వినుకొండ రూరల్ మండలం నీలగంగవరం, వెంకుపాలెం, బొల్లాపల్లి మండలం పేరుపాడు, వెల్లటూరు, నూజెండ్ల మండలంలోని పలు గ్రామాల్లో మట్టితవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు..

అక్రమ మట్టి తవ్వకాలపై పలుమార్లు పత్రికల్లో కథనాలు, ఫిర్యాదులు వచ్చినప్పటికీ మా పరిధిలోవి కాదని బొల్లాపల్లి, వినుకొండ రెవెన్యూ అధికారులు ఒకరిపై మరొకరు సాకులు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారు. అంతేకాకుండా అది మా పరిధికాదని, అటవీశాఖ పరిధిలోకి వెళ్తుందని ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకోవడంతో కాలం గడిచిపోతోంది. ఈలోపుగా అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వేస్తూ, అక్రమంగా రూ.కోట్లు ఆర్జిస్తున్నారు.

ప్రభుత్వ పనులకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలింపు..

అక్రమంగా ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వడంతోపాటు ప్రభుత్వం నిర్మించే రోడ్లకు, ఇతర నిర్మాణాలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే వినుకొండలో రియల్ ఎస్టేట్ వెంచర్లకూ ఇదే మట్టిని అమ్ముకుంటూ అందినకాడికి దోచుకుంటుండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమమట్టి తవ్వకాలను అడ్డుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



కొండ దిగువున పొక్లెయిన్లతో భారీగా తవ్వకాలు



అక్రమంగా తవ్విన మట్టిని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు తరలించిన దృశ్యం

మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

- బాసట ఆధ్వర్యంలో నిర్వహణ
- రెండు శిబిరాలకు 600 మంది హాజరు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: సేవే లక్ష్యంగా పనిచేస్తున్న 'బాసట' సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. జీబీఆర్ సంస్థ, సుదర్శని కంటి ఆసుపత్రి, జీజీహెచ్ వైద్యులు, బాసట సంయుక్త ఆధ్వర్యంలో రెండు ఉచిత వైద్యశిబిరాలు జరిగాయి. ఉదయం 6 గంటలకు బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతం శిబిరం, అనంతరం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాలకు వచ్చిన వారికి ఆలోకం వెంకాయమ్మ తృతీయ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త పెద్దబ్బాయ్య, కుమారుడు సురేష్, అల్లుడు వడ్డే సురేష్ ఆర్థిక సహకారంతో బీపీ, షుగర్, కంటి రెటీన పరీక్షలు, గుండె, మూత్రపిండాలకు సంబంధించిన అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం శిబిరంలో ప్రముఖ న్యూరాలజీ నిపుణులు గోపాళం శివన్నారాయణ, వైద్యులు వై రన్విత, రాజశ్రీ, గుంటుపల్లి భవ్యతేజ, గుంటుపల్లి దివ్యతేజ, ఎస్ నవ్యశ్రీ, జీజీహెచ్ డాక్టర్ వై రమేష్ ఆర్ఎం, డాక్టర్ లక్ష్మీ దంపతులు, గుంటూరు సుదర్శని కంటి ఆస్పత్రి వైద్యులు గణేషుని రాజేష్ నేతృత్వంలో మరో పది మంది హాజరై వైద్యసేవలు అందించారు. రెండు శిబిరాల్లో 600 మందిరాగా, వీరిలో 250 మంది రెగ్యులర్ వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు మందులు పంపిణీ చేశారు.

■ అలాగే మెగా కంటి వైద్యశిబిరంలో 350 మందికి కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 100 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేయగా, గతంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న 20 మందికి తిరిగి పొరలు తీసేందుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. కొందరికి కళ్లజోళ్లను రాసిచ్చారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారిని సోమవారం నుంచి వారంరోజులు షెడ్యూల్ ప్రకారంగా వీరిని ప్రత్యేక వాహనంలో గుంటూరు సుదర్శిని ఆస్పత్రికి తీసుకెళ్లి వసతి, భోజన సౌకర్యాలతో ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరాలు విజయవంతం చేసేందుకు సహకరించిన వాలంటీర్లు, టీచర్లు, గ్రామస్తులకు బాసట సభ్యులు అభినందించారు.

రూ.లక్ష విరాళం..

గ్రామీణ ప్రాంత ప్రజలకు బాసట సామాజిక, సాంస్కృతిక వేదిక స్వచ్ఛంద సంస్థ దశాబ్ద కాలంగా అందిస్తున్న సేవలకు ప్రశంసించారు. ఆదివారం శిబిరంలో వివిధ పరీక్షలకు అయ్యే ఖర్చుల్ని భరించడమే కాకుండా దాత ఆలోకం పెద్దబ్బాయి సంస్థ శాశ్వత నిధి కింద మరో రూ.లక్ష ప్రకటించారు. ఈ చెక్కును సంస్థ సభ్యులందరికీ సమక్షంలో అధ్యక్షులు నూతలపాటి కాళిదాసుకు అందజేశారు. బాసట సామినేని వెంకటేశ్వర్లు, పోపూరి శ్రీనివాసరావు, రావూరి సుమంత్, ముత్తవరపు రవీంద్రబాబు, కేతా రామబ్రహ్మం, బచ్చు రాజేష్, డాక్టర్ రావి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



శిబిరానికి హాజరైన గ్రామీణ ప్రాంత ప్రజలు

రైతులు బిల్లులు తీసుకోవాలి

నరసరావుపేట రూరల్: విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని ఏడీఏ పి.మస్తానమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. దుకాణాల వద్ద డీలర్లు స్టాక్ నిల్వలను, ధరలను తెలిపే పట్టికలను ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఇలా ప్రదర్శించిన దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అనుమతి లేకుండా విత్తనాలు విక్రయించకూడదని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న బయోమందులను మాత్రమే రైతులకు సూచించారు. అనుమతులు లేని బయోమందులను వినియోగించడం వలన రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ విధంగా బయోమందులను విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రహ్మం గారి దేవాలయానికి నిధులు మంజూరు చేయాలి



రాజుపాలెం: రహదారి నిర్మాణంలో కోల్పోతున్న బ్రహ్మంగారి దేవాలయ పునః నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రమేష్ కోరారు. మండల అనుపాలెం గ్రామంలోని బ్రహ్మంగారి దేవాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఉన్న దేవాలయం రహదారి నిర్మాణంలో కోల్పోతున్నందున హైవే వారు గుర్తించి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేవాలయం దాతలు ఇచ్చిన 10 సెంట్ల స్థలంలో ఏర్పాటు చేయబడిందని, రూ.50 లక్షలు వెచ్చించి మండపం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి రోజు ధూప, దీప, నైవేద్యాలు జరుగుతున్నందున భక్తుల విశ్వాసాన్ని పరిగణలోకి తీసుకుని నిధులు మంజూరు చేయాలని, నిధుల మంజూరుకు ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రంగు నాగభూషణం, గౌరవ అధ్యక్షుడు కోటగిరి పోతులూరయ్య, గ్రామ సర్పంచ్ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ బండి కోటినాగిరెడ్డి, తోట రఘునాథ్‌రావు, రాయ చంద్రశేఖర్ రెడ్డి, బెల్లంకొండ బ్రహ్మం, వీర్ల శ్రీనివాసరావు, సిరిగిరి అర్జునరావు, నల్లగొర్ల ఆవులయ్య, తిపర్తి శంకరరావు తదితరులు ఉన్నారు.

సీనియర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి మృతి



కల్లి రాజ్యలక్ష్మి(ఫైల్)

యడ్లపాడు: మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కల్లి రాజ్యలక్ష్మి (58) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ప్రతిరోజు మాదిరిగానే కార్యాలయంలో విధులు ముగించుకుని, సాయంత్రం యడ్లపాడు హైవే వద్ద ఆటో ఎక్కి ఇంటికి వెళ్తున్న సందర్భంలోనే ఆమెకు తీవ్రస్థాయిలో గుండెపోటు వచ్చింది. ఆటోలోనే తోటి ప్రయాణికులపై వాలిపోయిన ఆమెను గమనించిన వారు వెంటనే చిలకలూరిపేట పట్టణంలోని హైవే పక్కనున్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం ఆమె భౌతికకాయాన్ని స్వగ్రామమైన మానుకొండవారి పాలెంకి తీసుకెళ్లారు. 2004లో చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌పై జరిగిన నక్సలైట్ల దాడిలో రాజ్యలక్ష్మి భర్త కల్లి వీరారెడ్డి మృతి చెందారు. దీంతో ప్రభుత్వం ఆమెకు 2006లో యడ్లపాడు రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చింది. 2011లో నాదెండ్ల మండలానికి బదిలీ అయ్యారు. 2018లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై పిట్టలవేని వారిపాలెం వెళ్లి, 2024 అక్టోబర్‌లో జరిగిన రెవెన్యూ శాఖ అధికారుల సాధారణ బదిలీల్లో భాగంగా తిరిగి యడ్లపాడుకు వచ్చారు. విధుల్లో అంకితభావంతో, సహోద్యోగులతో సమన్వయంగా పని చేసే వ్యక్తిగా రాజ్యలక్ష్మి గుర్తింపు పొందారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజ్యలక్ష్మి మృతివార్త తెలియగానే తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, ఇతర రెవెన్యూ సిబ్బంది మానుకొండవారిపాలెం వెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించామని కుటుంబ సభ్యులు తెలిపారు.

రాజ్యలక్ష్మి మృతిపై సంతాపం

నాదెండ్ల: మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి గతేడాది యడ్లపాడు మండలానికి బదిలీ అయిన రాజ్యలక్ష్మి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ సంతోషకుమారి, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట మండలంలోని మానుకొండవారిపాలెంలో రాజ్యలక్ష్మి నివాసానికి వెళ్ళి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నేడు పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సాధారణ సమావేశం

నరసరావుపేట: జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సాధారణ సమావేశం ఏర్పాటు చేయటం జరిగిందని జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆదివారం వెల్లడించారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్య నిర్వహణ కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. దీనికి రెడ్‌క్రాస్ ప్యాట్రన్, వైస్ ప్యాట్రన్, లైఫ్ మెంబర్స్, లైఫ్ అసోసియేట్ మెంబర్స్ తమ రెడ్‌క్రాస్ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తమతో పాటు తీసుకొని హాజరు కావాలని కోరారు. మెంబర్ షిప్ కార్డు లేనివారిని అనుమతించమని జిల్లా సెక్రెటరీ తెలియజేశారు.

రెండవ రోజు కొనసాగిన ఎస్సీ కాలనీ వాసుల దీక్ష

సత్తెనపల్లి: లక్కరాజుగార్లపాడు ఎస్సీ కాలనీకి సంబంధించిన భూ సమస్యకు పరిష్కారం చూపించకుంటే న్యాయపోరాటం తప్పదని ఎమ్మార్పీస్ జిల్లా మాజీ వైస్ ప్రెసిడెంట్ జంగాల శ్రీనివాసరావు అన్నారు. లక్కరాజుగార్లపాడు ఎమ్మార్పీస్ గ్రామ కమిటీ వాసుల ఆమరణ నిరాహార దీక్షలు ఆదివారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఆమరణ దీక్ష చేస్తున్న జంగాల శ్రీనివాసరావు, ముప్పవరపు నాగరాజులకు మద్దతుగా రిలే దీక్షలు గ్రామ అధ్యక్షుడు బందెల జగన్ వారి కమిటీ సభ్యులు కూర్చున్నారు. దీక్షలను సత్తెనపల్లి మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకులు ప్రారంభించారు. జంగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ సైడ్ కాలువ, పంచాయతీ రోడ్‌లను కలుపుకొంటూ గ్రావెల్ తోలితే ఈ నెల 8వ తేదీ నుంచి గ్రావెల్ మట్టి తీయించలేని స్థితిలో పంచాయతీ సెక్రటరీ, ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారి, మండల డెవలప్‌మెంట్ అధికారులు ఉన్నారన్నారు. ఎందుకు అంత ఉదాసీనత, ఎందుకు సమస్య పట్ల నిర్లక్ష్యం, దీన్ని ఆదర్శం చేసుకొని మరొకరు మరొక సమస్య సృష్టించినా అధికారులు ఇలాగే ఉంటారా అని ప్రశ్నించారు. ఈ సమస్య పరిష్కారం చేయకుంటే న్యాయపోరాటం తప్పదని హెచ్చరించారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం కావాలి



డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన పార్టీ ఆయా విభాగాల నూతన అధ్యక్షులు, ఆర్యవైశ్య నాయకులు

- వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- గోపిరెడ్డిని సన్మానించి, కృతజ్ఞతలు తెలిపిన పార్టీ నేతలు

నరసరావుపేట: రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమితులైన నిడమానూరు సురేంద్ర, అచ్చి శివకోటి తన మద్దతుదార్లతో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియచేసి శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేశారు. సురేంద్ర మాట్లాడుతూ డాక్టర్ గోపిరెడ్డి గత 15ఏళ్లుగా వైద్య వృత్తిని మానుకొని ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసి వైఎస్ జగన్ అడుగుజాడల్లో నడుస్తూ కార్యకర్తలకు గుర్తింపునిచ్చే ఏకైక నాయకుడని కొనియాడారు. తనకు పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశమిచ్చిన ఆయన నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ముచేయకుండా రాబోయే రోజుల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి తిరిగి పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నూతనంగా నియమితులైన పట్టణ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు షేక్ కరీముల్లా, సురేంద్ర, అచ్చి శివకోటి అందరూ పార్టీ ఆవిర్భావం నుంచి అహర్నిశలు కష్టపడి పనిచేసిన వారని, భవిష్యత్తులో అందరిని కలుపుకొని పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కె.కిషోర్‌బాబు, గిరిజన, మాదిగ కార్పొరేషన్ మాజీ డైరక్టర్‌లు పాలపర్తి వెంకటేశ్వర్లు, కందుల ఎజ్రా, నాయకులు ఎస్‌కే ఆంజనేయులు, వంకా శ్రీనివాసరెడ్డి, హాలీవుడ్ రఘు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, చిన్నం శ్రీనివాసరావు, మిట్టపల్లి శేఖర్, పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్ పంపిణీ



సాతులూరులో రైతులకు డ్రోన్ అందిస్తున్న ఏఓ శ్రీలత, అధికారులు, నాయకులు

నాదెండ్ల: వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులను రైతులు అందిపుచ్చుకుని లాభసాటి సాగు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శ్రీలత చెప్పారు. సాతులూరు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయానికి వినియోగించే డ్రోన్‌ను రైతులకు అందించారు. గ్రామానికి చెందిన నార్నె శరభయ్య, వేజెండ్ల కోటేశ్వరరావు, వేజెండ్ల శ్రీనివాసరావు, ఈదర ఆంజనేయులు, కమ్మ కృష్ణప్రియ గ్రూపుకు రూ.9.80లక్షల విలువైన రసాయన మందులు పిచికారీ చేసే డ్రోన్‌ను పంపిణీ చేశారు. ఇందులో ప్రభుత్వం రూ.7.84 లక్షలు (80 శాతం) సబ్సిడీ అందించగా, రైతుల వాటాగా రూ.1.96 లక్షలు (20 శాతం) చెల్లించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయానికి వినియోగించే ఎన్నో రకాల ఆధునిక పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందన్నారు. రైతులు గ్రూపుగా ఏర్పడి పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన గ్రూపులకు ప్రభుత్వ చేయూత లభిస్తుందన్నారు. సర్పంచ్ ముసుగు శోభారాణి, మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, ఏఈఓలు రామారావు, వేణుగోపాలరావు, కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజమోహనరావు సేవలు విలువైనవి



ప్రగడ రాజమోహనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పట్టణ ప్రముఖులు

చిలకలూరిపేట: కళారంగానికి ప్రగడ రాజమోహనరావు అందించిన సేవలు ఎంతో విలువైనవని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన కళానిలయం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రగడ రాజమోహనరావు సంతాప సభను పట్టణంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల కిందట కళానిలయం సంస్థను స్థాపించి అప్పటి నుంచి నిర్విరామంగా నృత్య, సంగీత పోటీలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సాంప్రదాయ కళలకు ఆదరణ తగ్గిపోతున్న క్రమంలో జాతీయ స్థాయిలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నాట్య, సంగీత పోటీలు నిర్వహించిన కళాతపస్వి అని కొనియాడారు. సుమారు గత రెండేళ్లుగా ఆరోగ్యం ఏ మాత్రం సహకరించకున్నా, మంచానికే పరిమితమై కూడా జాతీయ స్థాయి నృత్య, సంగీత పోటీలు నిర్వహించటం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ టెలికం జేఈఓ ఏవీ శివయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నాయుడు శివకుమార్, మామిడి నెహ్రూ, రావు సుబ్రమణ్యం, అనంతశేఖర్, రత్నబాబు, డాక్టర్ గట్టు రంగారావు, షేక్ సలీం, పేలూరి రామారావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

13న ఓరియంటల్ హైస్కూల్ వజ్రోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న పూర్వవిద్యార్థి ఏలూరి ప్రసాదు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాన్ని జూలై 13వ తేదీన నిర్వహించనున్నట్లు పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ప్రకటించారు. పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణ సింగ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, పాఠశాల వ్యవస్థాపకుడు పండిత వేదాంతం రామకృష్ణమాచార్యులు శత జయంతి వేడుకలను సైతం వజ్రోత్సవంలో భాగంగా నిర్వహించాలని నిర్ణయించారు. శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపంలో వేడుకలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రొంపిచర్ల ఆంజనేయులు, డాక్టర్ వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్, ఏలూరి ప్రసాదు, జూలకంటి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి శిశు మందిరాలను ఆదరించాలి

అమరావతి: సరస్వతి శిశు మందిరాలలో విద్యార్థులకు జాతీయ భావన, నైతిక విలువలను బోధిస్తూ వారిని సంస్కారవంతులుగా, దేశ భక్తులుగా తీర్చిదిద్దుతున్నామని దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన్ మంత్రి లింగం సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సరస్వతి శిశు మందిరంలో సరస్వతి విద్యాపీఠం విజయవాడ సమితి ఆధ్వర్యంలో గుంటూరు విభాగ్ నూతన ప్రబంధకారిణి అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతి శిశు మందిరాలను ఆదరించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చదువుకున్న చదువు సమాజానికి, కుటుంబానికి, దేశానికి ఉపయోగపడే విధంగా ఉండాలని, సంస్కారవంతులుగా మార్చేదే నిజమైన విద్య అన్నారు. అటువంటి విద్యను అందించేందుకు విద్యాభారతి ఎన్నో వేల మంది కార్యకర్తలతో సేవా భావంతో దేశ వ్యాప్తంగా 24 వేల పాఠశాలలను నిర్వహిస్తుందన్నారు. గుంటూరు విభాగ అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు, కార్యదర్శి చిరుమామిళ్ల గోపికృష్ణ, విద్యాభారతి ఏపీ కార్యదర్శి జేపీఎస్ శాస్త్రి, కన్నా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.